సాక్షి
ఆదిలాబాద్

శుక్రవారం । 5 । సెప్టెంబర్ । 2025

గరిష్టం/కనిష్టం
30.0/24.0

వాతావరణం
సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడా చిన్నపాటి వర్షం కురిసే అవకాశముంది.

గంగమ్మ చెంతకు గణపయ్య

జిల్లాలో పలుచోట్ల గణేశ్ నిమజ్జనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండళ్ల నిర్వాహకులు గణపతి విగ్రహాలను అందంగా అలంకరించిన వాహనాల్లో జలాశయాల వద్దకు తరలించి నిమజ్జనం చేశారు.

- వివరాలు 9లో ▸



న్యూస్‌రీల్

రూ.25వేల పరిహారం చెల్లించాలి

కైలాస్‌నగర్: భారీ వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25వేల పరిహారం చెల్లించాలని అఖిలపక్ష రైతు సంఘం నాయకులు కోరారు. గురువారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ రాజర్షి షాను కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. జిల్లాలో గతంలో ఏన్నడూ లేని విధంగా కురిసిన భారీ వర్షాలకు 18,500 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖ గుర్తించిందని తెలిపారు. ఇసుక మేటలు వేసిన చేన్లకు ఎకరాకు రూ.35వేల పరిహారం అందజేసి ఆదుకోవాలని కోరారు.

7న అవార్డు ప్రదానం

ఆదిలాబాద్‌టౌన్: ఈనెల 7న జెడ్పీ సమావేశ మందిరంలో ఉదారి నాగదాసు స్మారక కవిత అవార్డు ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకుకు డాక్టర్ ఉదారి నారాయణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అవార్డుకు కరీంనగర్‌లోని కవయిత్రి తోట నిర్మలారాణి ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఆమెకు ప్రశంసాపత్రంతో పాటు రూ.5వేల నగదు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి సాహితీ అభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

గణపతిపూజలో మహరాజ్



భాష్టంద్, సూరజ్ మహరాజ్‌లతో ఎమ్మెల్యే

నేరడిగొండ: మండలంలోని ఇస్పూర్ గ్రామంలో గురువారం నిర్వహించిన గణపతి పూజకు భాష్టంద్, సూరజ్ మహరాజ్‌లు హాజరయ్యారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ వారిని మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదం పొందారు. అనంతరం గ్రామస్తులతో కలిసి గణపతి పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యే అనిల్‌జాదవ్‌ను శాలువాతో సన్మానించారు. వినాయకుడి ఆశీస్సులతో గ్రామం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. అలాగే రాజురా గ్రామంలోగల గణనాథుడిని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆయనను గ్రామస్తులు సన్మానించారు.

ముగిసిన భగవత్ పారాయణం




పారాయణం చేస్తున్న గ్రామస్తులు

ఇచ్చోడ: మండలంలోని ముఖరా (బీ) గ్రామంలోగల పూలాజీబాబా ధ్యాన మందిరంలో రెండు నెలలుగా నిర్వహిస్తున్న భగవత్ పారాయణం గురువారం ముగిసింది. రెండు నెలలుగా నిత్యం రాత్రి 8నుంచి 10గంటల వరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ముగింపు సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో దేవ్‌రావుమహరాజ్, సంతోష్, మాదవ్, కిషన్, ప్రకాశ్, శివాజీ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న ఫిజిక్స్ గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ జే సంగీత గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్ట్‌లో పీజీ 55 శాతం, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50శాతం మార్కులు కలిగి ఉండాలని పేర్కొన్నారు. నెట్, సెట్, పీహెచ్‌డీ అర్హత కలిగి బోధనలో అనుభవమున్న అభ్యర్థులకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. అర్హులు సంబంధిత ధ్రువపత్రాలతో ఈనెల 6లోపు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. 8న నిర్వహించనున్న డెమోకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని, పూర్తి వివరాలకు కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

లింగ వివక్ష చూపించొద్దు



అవగాహన కల్పిస్తున్న కోఆర్డినేటర్ యశోద

ఆదిలాబాద్‌టౌన్: బాల బాలికలను సమానంగా చూడాలని, లింగ వివక్ష చూపించొద్దని మిషన్ కోఆర్డినేటర్ యశోద సూచించారు. గురువారం ఆదిలాబాద్ పట్టణంలోని స్వామి రామానంద తీర్థ ఇనిస్టిట్యూట్‌లో జెండర్ సెన్సిటైజేషన్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలికలకు సమాన అవకాశాలు, మహిళా సాధికారత, పనిచేసే చోట వేధింపులు, పోక్సో, తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లావణ్య, చంద్రశేఖర్, దినేశ్ తదితరులు పాల్గొన్నారు.

మా దేవుడు మీరే మాస్టారూ..

అజ్ఞానమనే అంధకారాన్ని విజ్ఞానమనే వెలుగుతో పారదోలుతారు. ఉన్నత లక్ష్యాల సాధనకు ప్రేరణ కలిగిస్తారు. నేటి బాలలను రేపటి పౌరులుగా తీర్చిదిద్దుతారు. వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేస్తారు. ఎన్ని అడ్డంకులెదురైనా వృత్తికి న్యాయం చేస్తారు. శిష్యులను ప్రవృత్తిలో నిలుపుతారు. ఇన్ని చేసే ఆ దేవుళ్లే పాఠశాలలో విద్యను బోధించే గురువులు. నేడు టీచర్స్‌డే సందర్భంగా వృత్తిలో ఉత్తమంగా రాణించి రాష్ట్ర, జిల్లా స్థాయి ఉత్తమ అవార్డులకు ఎంపికైన పలువురు ఉపాధ్యాయులపై కథనం..



పేద విద్యార్థులను ప్రోత్సహిస్తూ..



ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న సూరజ్‌సింగ్ రాష్ట్ర ఉత్తమ లెక్చరర్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈయన ఇంద్రవెల్లి మండలంలోని అందునాయక్ తండాకు చెందినవారు. 2002 నుంచి 2012 వరకు కాంట్రాక్ట్ లెక్చరర్‌గా పని చేశారు. 2013 సెప్టెంబర్ 13న ఏపీపీఎస్సీ ద్వారా రెగ్యులర్ లెక్చరర్‌గా నియమితులయ్యారు. మొదట ఇచ్చోడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హిందీ లెక్చరర్‌గా పని చేశారు. ఆ తర్వాత గుడిహత్నూర్‌లో, ప్రస్తుతం జిల్లా కేంద్రంలోని జూనియర్ కళాశాలలో పనిచేస్తున్నారు. ఈయన పేద విద్యార్థులకు ఉచిత కోచింగ్ ఇస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. 2009 నుంచి 2012 వరకు 230 మంది అభ్యర్థులకు ఉచిత కోచింగ్ ఇవ్వగా 148 మంది డీఎస్సీలో హిందీ పండితులుగా నియమితులయ్యారు. చదువు మధ్యలో మానేసి పెళ్లి చేసుకున్న ఆయన శిష్యురాలు శీతల్‌ను ప్రోత్సహించి హిందీ పండిత్‌గా ఉద్యోగం సాధించేలా ప్రోత్సహించారు. రాష్ట్రస్థాయిలో ఈమె మూడో ర్యాంక్ సాధించారు. శీతల్ కూడా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపిక కావడం విశేషం. క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన బోధన చేయడంతో సూరజ్‌సింగ్‌ను ప్రభుత్వం రాష్ట్ర స్థాయి ఉత్తమ లెక్చరర్ అవార్డుకు ఎంపిక చేసింది. నేడు హైదరాబాద్‌లో సీఎం చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకోనున్నారు.

- మరిన్ని కథనాలు 8లో ▸

ఆంగ్లంలో బోధిస్తూ.. పుస్తకాలు రాయిస్తూ..

ఇంద్రవెల్లి: మండలంలోని ఏమాయికుంట ఎంపీయూపీఎస్‌లో ఎస్జీటీగా విధులు నిర్వహిస్తున్న బుక గంగయ్య విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచే ఇంగ్లిష్‌లో రాణించేలా బోధిస్తున్నారు. ఐదోతరగతి విద్యార్థులతో ఇంగ్లిష్‌లో మాట్లాడిస్తున్నారు. వారితో పుస్తకాలు రాయించి ఆవిష్కరిస్తున్నారు. నీతి కథలు రాసి దిశానిర్దేశం చేస్తున్నారు. 'మా బడికి రండి' అంటూ బడీడు పిల్లలను పాఠశాలకు రప్పించడానికి కృషి చేస్తున్నారు. ఏమాయికుంట పాఠశాలలో 98 మంది విద్యార్థులుండగా వారి సంఖ్యను 140 మందికి పెంచారు. పాఠశాల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారు. లయన్స్ క్లబ్ సహకారంతో పాఠశాల ఆవరణలో మొక్కలు నాటిస్తున్నారు. కూరగాయలు పండించి వాటితోనే మధ్యాహ్న భోజనం వండిస్తున్నారు. విద్యార్థులకు శుద్ధజలం అందించేందుకు, ప్లేట్లు పంపిణీ చేయించడానికి తనవంతు కృషి చేశారు. ఇన్ని చేసిన గంగయ్య సేవలను గుర్తించిన విద్యాశాఖ అధికారులు రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేశారు. నేడు సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా గంగయ్య అవార్డు అందుకోబోతున్నారు.



విద్యార్థులతో కలిసి మొక్క నాటుతున్న గంగయ్య (ఫైల్)

బోధనతోపాటు సేవల్లోనూ రాణిస్తూ..

సాత్నాల: భోరజ్ మండలం పిప్పర్‌వాడ జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయురాలు శశికళ పాఠ్యాంశాల బోధనతోపాటు విద్యార్థుల్లోని సృజనాత్మకతను ప్రోత్సహిస్తున్నారు. చిత్రలేఖనం, కవిత్వం, కథా రచన, సైన్స్ మోడల్స్, వేదికపై ఆత్మవిశ్వాసంతో మాట్లాడడం లాంటి అంశాల్లో మార్గనిర్దేశం చేస్తున్నారు. ఆమె మార్గదర్శకత్వంలో పలువురు విద్యార్థులు జిల్లాస్థాయి పోటీలు, రాష్ట్ర సైన్స్ ఫెయిర్‌లో బహుమతులు గెలుచుకున్నారు. 130మంది విద్యార్థులున్న పాఠశాలలో అదనంగా మరో 45 మందిని చేర్పించారు. పాఠశాలలో వంటగదిని సొంత ఖర్చులతో నిర్మించారు. ఉదయం విద్యార్థులకు రాగి జావ అందిస్తారు. మధ్యాహ్న భోజనం కోసం విద్యార్థులకు దాతల ద్వారా ప్లేట్లు ఇప్పించారు. కంప్యూటర్ బోధనకు అవసరమైన సామగ్రిని దాతల సాయంతో సమకూర్చారు. బడిలో మొక్కల పెంపకం, కూరగాయల సాగు చేపట్టారు. ఏడేళ్లుగా 100శాతం ఫలితాలు సాధిస్తుండడంతో ఉత్తమ ప్రధానోపాధ్యాయురాలిగా ఎంపికై నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకోబోతున్నారు. 2020లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలుగా పురస్కారం, 2022లో స్వచ్ఛ విద్యాలయం కింద జిల్లా స్థాయిలో అవార్డు అందుకున్నారు.



విద్యార్థినులతో ఉపాధ్యాయురాలు శశికళ

దిగుబడిపై దిగాలు



తాంసి మండలం పొన్నారి గ్రామానికి చెందిన ఈ రైతు మలపతి శంకర్ పదెకరాల్లో పత్తి సాగు చేశాడు. రూ.2లక్షల పెట్టుబడి పెట్టాడు. పూత, కాత చూసి సంబురపడ్డాడు. ఇటీవల ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో కనీసం కలుపు కూడా తీయలేకపోయాడు. వర్షం నిలిచిపోగా చేనులో రాలిన పూత, కాత చూసి మనోవేదనకు గురవుతున్నాడు.



సిరికొండ మండల కేంద్రానికి చెందిన ఈ రైతు పేరు ఆర్ మల్లేశ్. ఐదెకరాల్లో పత్తి సాగు చేశాడు. అధిక వర్షాలతో ప్రస్తుతం పంట ఎదుగుదల పూర్తిగా ఆగిపోయింది. మొక్కలు ఎరుపు రంగులోకి మారాయి. వర్షపునీరు చేరి వడలిపోయాయి. ఎండ అసలుకే తగలకపోవడంతో తిరిగి కోలుకునే పరిస్థితి కూడా కనిపించడం లేదు.



తాంసి మండలం పొన్నారిలో ఓ రైతు చేనులో రాలిన పత్తి పిందెలు (ఫైల్)

- ఇటీవలి వర్షాలకు దెబ్బతిన్న పత్తి
- చేనులో రాలిపోయిన పూత, కాత
- పెట్టుబడి డబ్బులూ రాని దుస్థితి
- పరిహారంతో సర్కార్ ఆదుకునేనా?

వానాకాలంలో సాగు వివరాలు

సాగు విస్తీర్ణం	5.85లక్షల ఎకరాలు
పత్తి విస్తీర్ణం	4.40లక్షల ఎకరాలు

సాక్షి, ఆదిలాబాద్: జిల్లాలో ఆగస్టులో కురిసిన వర్షాలు పత్తి రైతులను తీవ్రంగా దెబ్బతీశాయి. పూర్తిగా పంట నష్టపోయిన పలువురు రైతులు దిగాలు చెందుతున్నారు. వ్యవసాయ శాఖ సర్వే నిర్వహించి నష్టం అంచనా వేసింది. ప్రభుత్వానికి నివేదిక పంపనుంది. దెబ్బతిన్న పంటలు కాస్తయినా మెరుగవుతాయని ఆశించిన రైతులు చేల వద్దకు వెళ్లి బావురమంటున్నారు. చేను అడుగుభాగంలో రాలిన పత్తి పిందెలను చూసి ఆవేదన చెందుతున్నారు. పెట్టిన పెట్టుబడి తిరిగి వస్తుందో.. రాదో.. అని మనోవేదనకు గురవుతున్నారు. ప్రభుత్వం కనికరం చూపి పరిహారం మంజూరు చేసి ఆదుకుంటుందని ఆశిస్తున్నారు. ఇది జిల్లాలోని వర్షాలకు పంట దెబ్బతిన్న పత్తి రైతుల ప్రస్తుత దయనీయ స్థితి.

ఇవీ శాస్త్రవేత్తల సూచనలు

వర్షాలు తగ్గిన తర్వాత చేలలో నిలిచిన నీటిని బయటకు వెళ్లేలా కాలువలు తీయాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ఎకరాకు కాపర్‌ఆక్సిక్లోరైడ్ (సీవోసీ) 3 గ్రాములు లీటర్ నీటిలో కలిపి మొక్కల అడుగు భాగంలో పిచికారీ చేయాలని చెబుతున్నారు. 19:19:19 ఐదు గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచిస్తున్నారు. 35కిలోల యూరియా, 10కిలోల పొటాష్ కలిపి చల్లాలని బాధిత రైతులకు వివరిస్తున్నారు.

అంతరకృషి చేయాలి



పత్తి పంటలో పూత, కాత రాలిన పక్షంలో ప్లాంటమైసిన్ (స్ట్రెప్టోమైసిన్) ఒక గ్రాము, బోరాన్ 14 లీటర్ల నీటిలో కలిపి మొక్కలపై పిచికారీ చేయాలి. తద్వారా పూత, కాత నేల రాలకుండా నివారించవచ్చు. కలుపు నివారణకు ఎద్దులతో అంతరకృషి చేయాలి.

– డాక్టర్ మోహన్‌దాస్, శాస్త్రవేత్త, వ్యవసాయ పరిశోధనా స్థానం, ఆదిలాబాద్

షాపుల్లోనే దొడ్డు బియ్యం



పురుగులతో తుట్టెలు కట్టి కనిపిస్తున్న ఈ బియ్యం సంచులు జిల్లా కేంద్రంలోని ఖిల్లా కాలనీలోగల ఓ రేషన్‌దుకాణంలోనివి. సన్న బియ్యం పంపిణీ ప్రారంభానికి ముందు నెల కోటా కింద తీసుకువచ్చిన దొడ్డుబియ్యం పంపిణీ చేయగా 60 క్వింటాళ్లు మిగిలాయి. ఐదు నెలలుగా వాటి తరలింపుపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో ఇలా పురుగులు పట్టి పనికిరాకుండా పోతున్నాయి.

జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణ్‌వాడ కాలనీలోగల ఓ రేషన్‌షాపులోని దొడ్డుబియ్యం దుస్థితి ఇది. నెలలు గడుస్తున్నా తరలించకపోవడంతో ఎలుకలు సంచులకు కన్నం వేసి బియ్యం తినేస్తున్నాయి. ఎలుకల వ్యర్థాలతో నిండిన బియ్యం తినడానికి వీల్లేకుండా మారుతున్నాయి. ఈ పరిస్థితి ఈ రెండు షాపుల్లోనే కాదు.. జిల్లాలోని అన్ని షాపుల్లోనూ నెలకొంది.



- ఐదునెలలుగా రేషన్ దుకాణాల్లోనే..
- జిల్లా వ్యాప్తంగా 4,771 క్వింటాళ్లు
- తరలింపులో అధికారుల నిర్లక్ష్యం
- వృథాగా పోతున్న పీడీఎస్ రైస్

కైలాస్‌నగర్: జిల్లాలో రేషన్‌షాపుల్లో మిగిలిపోయిన దొడ్డుబియ్యం నిల్వల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. వాటి తరలింపుపై పౌరసరఫరాల శాఖ ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో ఐదు నెలలుగా రేషన్ దుకాణాల్లోనే నిల్వ చేయాల్సి వస్తోంది. ఈ బియ్యాన్ని భద్రపర్చడం డీలర్లకు ఇబ్బందిగా మారింది. దీనికి తోడు పోర్టిఫైడ్ రైస్ కలిపి ఉంచడంతో ఈ బియ్యం పౌడర్‌గా మారుతున్నాయి. దీంతో పురుగులు పట్టి తుట్టెలు కడుతున్నాయి. కొన్నిచోట్ల ఎలుకలు బియ్యాన్ని బుక్కేస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా వేలాది క్వింటాళ్ల బియ్యం పనికిరాకుండా పోతుండగా సర్కారు ఖజానాకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. అయినా పౌరసరఫరాలశాఖ అధికారులు దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పురుగులు చేరి.. తుట్టెలు కట్టి

రాష్ట్ర ప్రభుత్వం ఉగాది కానుకగా ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్‌కార్డుదారులకు సన్నబియ్యం సరఫరా చేస్తోంది. అయితే మార్చి కోటా కింద విడుదల చేసిన దొడ్డుబియ్యం జిల్లాలోని చాలా రేషన్‌షాపుల్లో మిగిలిపోయాయి. ఎంఎల్‌ఎస్ పాయింట్లలోనూ నిల్వలు పేరుకుపోయాయి. ఇలా జిల్లా వ్యాప్తంగా 4,771.08 క్వింటాళ్ల దొడ్డుబియ్యం రేషన్ దుకాణాల్లో మూలుగుతున్నాయి. జిల్లాలోని అత్యధిక దుకాణాలు అద్దె గదుల్లోనే ఉండటంతో దొడ్డుబియ్యం నిల్వలతో ఇరుకుగా మారుతోంది. దీనికి తోడు పంపిణీ చేయాల్సిన సన్నబియ్యం తెచ్చుకోవడంతో స్థలం సరిపోక వాటిని భద్రపర్చడం డీలర్లకు తలకుమించిన భారంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు పలుచోట్ల బియ్యం తడిసి ముద్దగా మారాయి. మరికొన్ని చోట్ల పురుగులు చేరి తుట్టెలు కట్టి పనికిరాకుండా పోతున్నాయి. దొడ్డుబియ్యంలోని పురుగులు ప్రస్తుతం పంపిణీ చేస్తున్న సన్నబియ్యంలోనూ కలుస్తుండటంతో లబ్ధిదారులు వాటిని కూడా తీసుకునేందుకు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో మిగులు బియ్యం నిల్వలు (క్వింటాళ్లలో)

రేషన్ దుకాణాలు	356
ఎంఎల్‌ఎస్‌సీ నిల్వలు	416.41
ఎఫ్‌ఎస్‌సీ నిల్వలు	4,345.12
ఏపవై నిల్వలు	9.55

స్పందించకుంటే తీవ్ర నష్టం

రేషన్‌షాపుల్లోని దొడ్డుబియ్యం నిల్వలు ప్రభుత్వం వెనక్కి తీసుకుంటే మంచిదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. వాటిని షాపుల నుంచి తెప్పించుకుని విక్రయిస్తే ప్రభుత్వానికి కొంత ఆదాయం సమకూరే అవకాశముంది. మరింత ఆలస్యం చేస్తే దొడ్డుబియ్యం పూర్తిగా పాడై పనికిరాకుండా పోయే దుస్థితి ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి షాపుల్లోని నిల్వ ఉన్న బియ్యం వెనక్కి తీసుకోవాలని పలువురు సూచిస్తున్నారు.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం

జిల్లాలోని రేషన్ దుకాణాల్లో పేరుకుపోయిన దొడ్డుబియ్యం నిల్వల సమాచారాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. ఇక్కడి పరిస్థితులు వివరించాం. ఇటీవల రాష్ట్రంలోని అన్ని డీఎంలతో ఉన్నతాధికారులు సమావేశం నిర్వహించారు. త్వరలోనే దొడ్డుబియ్యం తరలింపుపై ఆదేశాలు వచ్చే అవకాశముంది. అధికారుల ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటాం. బియ్యం పాడవకుండా డీలర్లు భద్రపర్చాల్సిన అవసరముంది. – సుధారాణి, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్

ఉపాధ్యాయులు సమాజ నిర్మాతలు



సన్మాన గ్రహీతలతో కలెక్టర్ రాజర్షి షా, డీఈవో ఖుష్బూ గుప్తా

- కలెక్టర్ రాజర్షిషా
- ఉత్తమ టీచర్లకు అవార్డుల పంపిణీ

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయులు సమాజ నిర్మాతలని కలెక్టర్ రాజర్షిషా పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని శాలువాలు, పూలమాలలతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్‌కు పునాది వేయాలని, వారికి రోల్‌మోడల్‌గా నిలువాలని సూచించారు. పాఠశాలల్లో ఏఐ ద్వారా నాణ్యమైన విద్యాబోధన అందుతుందని తెలిపారు. కొందరు ఉపాధ్యాయులు వాగులు, వంకలూ లెక్కచేయకుండా పాఠశాలలకు వెళ్లి విద్యాబోధన చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యలు అసెంబ్లీలో ప్రస్తావించి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఈవో, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, ట్రైనీ కలెక్టర్ సలోని చాబ్రా, మండల విద్యాధికారి సోమయ్య, సెక్టోరియల్ అధికారులు ఉదయశ్రీ, రఘురమణ, ఉప్కం తిరుపతి, కందుల గజేందర్, శ్రీహరిబాబు, గడ్డం శశికళ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు కొమ్ము కృష్ణకుమార్, అశోక్, సోగల సుదర్శన్, శ్రీనివాస్, గడుగు నరేందర్, ఉపాధ్యాయులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

గణపయ్యకు కలెక్టర్ పూజలు



పూజలు చేస్తున్న కలెక్టర్ దంపతులు

కైలాస్‌నగర్: వినాయక నవరాత్రోత్సవాల సందర్భంగా జిల్లా కేంద్రంలోని రెవెన్యూ గెస్ట్ హౌస్‌లో ప్రతిష్ఠించిన గణపయ్యకు కలెక్టర్ రాజర్షిషా దంపతులు గురువారం పూజలు చేశారు. వారితోపాటు అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రైనీ కలెక్టర్ సలోని చాబ్రా, డీఎఫ్‌వో ప్రశాంత్ బాజీరావు పాటిల్ పూజల్లో పాల్గొన్నారు.

నిమజ్జనోత్సవ ఏర్పాట్లు ముమ్మరం

కైలాస్‌నగర్: ఈ నెల 6న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న వినాయక నిమజ్జన శోభాయాత్రకు బల్దియా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రూట్‌మ్యాప్ ప్రకారం పట్టణంలోని 49వార్డుల పరిధిలోని వినాయక విగ్రహాల శోభాయాత్ర నిర్వహించనున్న ప్రాంతాలు, ప్రధాన చౌక్‌లలో రోడ్లపై గుంతలను మొరం, స్టోన్‌డస్ట్‌తో పూడ్చివేస్తున్నారు. అడ్డు వచ్చే చెట్ల కొమ్మలు తొలగిస్తున్నారు. వేలాడే విద్యుత్ తీగలను సరి చేస్తున్నారు. ప్రత్యేక హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేస్తున్నారు. మజీద్‌ల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి కవర్లతో కప్పేస్తున్నారు. శోభాయాత్ర తిలకించేందుకు వచ్చే భక్తుల కోసం తాత్కాలిక టాయ్‌లెట్స్ ఏర్పాటు చేస్తున్నారు. ప్రసాద వితరణతో పాటు తాగునీటి సౌకర్యం అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక బారికేడ్లు ఏర్పాటు చేయనున్నారు. నిమజ్జనం చేసే పెన్‌గంగా, చాందా వాగు వద్ద 10మంది చొప్పున గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచనున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా ప్రత్యేకంగా నీటిపై తేలియాడే తెప్పలు అందుబాటులో ఉంచుతున్నట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి భాస్కర్ నాయక్ తెలిపారు. పెన్‌గంగా వద్ద ప్రత్యేక క్రేన్లు, లైటింగ్ ఏర్పాటు చేశారు.



దుర్గానగర్‌కు వెళ్లే రోడ్డుపై ఉన్న గుంతలను స్టోన్ డస్టుతో నింపుతున్న సిబ్బంది

క్లుప్తంగా

కాలువలో పడి బాలుడి మృతి


జయరాజ్ మృతదేహం

నిర్మల్‌రూరల్: మండలంలోని ఎల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన బత్తుల జయరాజ్ (12) ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందినట్లు రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపారు. ఆయన కథనం ప్రకారం ..బుధవారం మధ్యాహ్నం తల్లి బత్తుల లతీకతో కలిసి తోటకు కూలీ పనులకు వెళ్లాడు. మధ్యాహ్నం అందరితో కలిసి భోజనం చేసిన తర్వాత పక్కనే ఉన్న కెనాల్‌లో ఆడుకోవడానికి వెళ్లాడు. ఆ సమయంలో భారీ వర్షం పడడంతో ప్రమాదవశాత్తు కాలుజారి కాలువలో పడిపోయాడు. చాలాసేపటి తర్వాత గమనించిన తల్లి, గ్రామస్తులు జయరాజు కోసం వెతకగా కాలువలో ఆచూకీ లభించలేదు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో గురువారం ఉదయం సంఘటన స్థలానికి చేరుకున్న రూరల్ ఎస్సై, సిబ్బంది కాలువలో గాలించి మృతదేహాన్ని బయటకు తీశారు. జయరాజ్ తండ్రి గత కరోనాలో మృతిచెందగా, తల్లి కూలీ చేసుకుంటూ బతుకుతోంది. కాగా జయరాజుకు మానసిక స్థితి సరిగాలేదని, ఇంట్లోనే ఉంటాడని రూరల్ ఎస్సై పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

రైలు కిందపడి ఆత్మహత్య

మంచిర్యాలక్రైం: రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి(35) ఆత్మహత్య చేసుకున్నాడని జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ జస్పాల్‌సింగ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మంచిర్యాల శివారు గోదావరి బ్రిడ్జి సమీపంలో సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి బుధవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడని సమాచారం అందింది. ఈ మేరకు ఘటనస్థలానికి వెళ్లి పరిశీలించగా మృతి చెందిన వ్యక్తి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతుడి శరీరంపై నీలిరంగు టీషర్ట్, గోధుమ కలర్ చెప్పులు, నల్లటి గడ్డం, కుడి చేతికి రబ్బరు కడియం ధరించి ఉంది. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చ్యురీ గదిలో భద్రపర్చినట్లు తెలిపారు. ఇతని వివరాలు తెలిస్తే 8712658596, 9849058691 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పురుగుల మందు తాగి వ్యక్తి..

తలమడుగు: మద్యం మత్తులో పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై రాధిక తెలిపారు. ఆమె కథనం ప్రకారం.. మండలంలోని అర్లి(కే) గ్రామానికి చెందిన ఎల్పుల లక్ష్మయ్య (47) ఆటోడ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. వచ్చిన డబ్బులు మద్యం తాగేవాడు. బుధవారం రాత్రి మద్యం మత్తులో ఇంట్లో పురుగుల మందు తాగి పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించగా అప్పటికే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

6న రాయిసెంటర్ ఉమ్మడి జిల్లా సమావేశం

ఉట్నూర్‌రూరల్: ఈనెల 6న గోండ్వాన పంచాయతీ రాయిసెంటర్ ఉమ్మడి జిల్లా సమావేశం ఉట్నూర్‌లోని మత్తడిగూడ రాయిసెంటర్ భవనంలో నిర్వహించనున్నట్లు ఆదివాసీ హక్కుల పోరాటసమితి తుడుందెబ్బ రాష్ట్ర కార్యనిర్వహణ అధ్యక్షుడు గోడం గణేశ్ తెలిపారు. ఉట్నూర్‌లోని కుమురం భీం కాంప్లెక్స్‌లో గురువారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. లంబాడా, సుగాలీ, బంజారాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని సుప్రీంకోర్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కొన్నిరోజుల క్రితం నోటీసులు జారీ చేసిందన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఉన్న ఆదివాసీ 9 తెగల గోండ్వాన పంచాయతీ రాయిసెంటర్ సార్‌మేడీలు, గ్రామపటేల్, దేవరీలు, కుల సంఘాలు, ఆదివాసీ సంఘాల నాయకులు, విద్యార్థులు, యువకులు, మహిళలు, రాజకీయ నాయకులు, తాజా మాజీ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఉద్యోగ సంఘాల నాయకులు, మేధావులు, ప్రజలు తరలివచ్చి ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పుర్క బాపురావ్, ఆదివాసీ మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెందుర్ పుష్పరాణి, ఆత్రం తిరుపతి, మాజీ జిల్లా అధ్యక్షుడు, ఆడ హనుమంత్ రావు గోండ్వాన వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు, సిడం సోనేరావు పటేల్ మెస్రం నాగ్నాథ్, ఇంద్రవెల్లి మండలం తుడుందెబ్బ మాజీ అధ్యక్షుడు మాధవి యశోద, మోతీరాం, మత్తడిగూడ మాజీ సర్పంచ్, ఆదివాసీ నాయకులు కుమ్ర వినాయక్ పాల్గొన్నారు.

ఒక విద్యార్థి నుంచి 30 మందికి..



లక్ష్మణచాంద: మండలంలోని మల్లాపూర్‌కు అనుబంధ గ్రామమైన మాచాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏకోపాధ్యాయురాలు లక్ష్మి 2024 అక్టోబర్ 16న జాయిన్ అయింది. ఆ సమయంలో ఒక విద్యార్థి ఉన్నారు. బడి మూతపడటం ఖాయమనే సమయంలో విద్యార్థుల సంఖ్యను 30 మందికి చేర్చారు. ఆటపాటల ద్వారా బోధన, నేలపై పిల్లలతోపాటు కూర్చొని బోధించడటం లక్ష్మి ప్రత్యేకత. భీమేశ్ దాత సాయంతో రూ.40 వేలతో పాఠశాల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయించింది. సొంత నిధులు రూ.25 వేల వెచ్చించి ఫర్నిచర్, కుర్చీలు, గ్రీన్‌నెట్, కిచెన్ గార్డెన్, ఆట వస్తువులు సమకూర్చింది. – లక్ష్మి, ఎస్జీటీ, మాచాపూర్ ప్రాథమిక పాఠశాల

ఆనందంగా ఉంది

ఉట్నూర్‌రూరల్: పాఠశాలకు జాయిన్ అయినప్పుడు 40 నుంచి 50 మంది విద్యార్థులు ఉన్నారు. తల్లిదండ్రులకు అవగాహన కల్పించడంతో ప్రస్తుతం 100 మంది వరకు పాఠశాలలో చేరారు. జిల్లాస్థాయి వరకు గణితం పోటీల్లో విద్యార్థులు రాణించారు. గత సంవత్సరం విద్యార్థులు 500 పైబడి మార్కులు సాధించారు. తాను బుక్‌లు, ఇతర సామగ్రి అందించాం. తమ సేవలు గుర్తించడం ఆనందంగా ఉంది. – కుమ్ర మోతీరాం ఎస్‌ఏ మాథ్స్ ఉపాధ్యాయుడు యేంద

వందశాతం అమలు చేశాం

పాఠశాలలో టీచర్స్ డే, మొక్కలు నాటే కార్యక్రమం, ఆరోగ్య పాఠశాల, పరిసరాల పరిశుభ్రత పాఠశాలలో వంద శాతం అమలయ్యేలా చూశాం. అన్ని కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించాం. ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థులు ఆకర్షితులై ఒక్క రోజు సెలవు తీసుకోకుండా వస్తున్నారు. తమ సేవలు గుర్తించి అవార్డు అందుకోవడం ఆనందం ఉంది. కలెక్టర్, డీఈవో, అధికారుల ఆదేశాలను పాటిస్తున్నాం. – ఎస్.రమేశ్‌రెడ్డి, ఉత్తమ ఉపాధ్యాయుడు జెడ్పీఎస్ఎస్, సాలెవాడ(కె)



మాస్టార్లు

- పిల్లలను తీర్చిదిద్దుతున్న టీచర్లు
- వారి ఉన్నతికి, బడి బాగుకు కృషి
- ఆటబొమ్మలతో విద్యాబోధన
- నేడు ఉపాధ్యాయ దినోత్సవం

విద్యార్థి భవిష్యత్తు పాఠశాలలోనే రూపుదిద్దుకుంటుంది. డాక్టర్ అయినా, సైంటిస్ట్ అయినా, పొలిటీషియన్ అయినా, రచయిత అయినా, రాజకీయ నాయకుడు అయినా గురువు శిష్యులే.. మంచి ఉపాధ్యాయుడు చెక్కిన విద్యార్థి భవిష్యత్ ఉన్నతంగా ఉంటుంది. పిల్లల జీవితాలను తీర్చిదిద్దేది గురువు. పాఠశాల బాగుకు, విద్యార్థుల ఉన్నతికి, బడిమానేసిన వారిని పాఠశాలల్లో చేర్పించేందుకు కృషిచేస్తున్నారు. చదువులో వెనుకబడినవారిపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నారు. పాఠాలు సులువు అర్థమయ్యేలా గోడలపై రంగురంగుల బొమ్మలు గీస్తూ బోధన చేస్తున్నారు. సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాలో విద్యార్థుల భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుతున్న.. ప్రభుత్వ పాఠశాలలకు ప్రాణం పోస్తున్న కొంత మంది ఉపాధ్యాయులపై ప్రత్యేక కథనం.

భార్య జ్ఞాపకార్థం.. బడి కోసం..!

భైంసాటౌన్: భార్యాభర్తలిద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులే. అయితే కొద్దికాలానికి భార్య మృతి చెందడంతో, ఆమె జ్ఞాపకార్థం ప్రభుత్వ బడుల బాగే లక్ష్యంగా పనిచేస్తున్నారు. ఆయనే భైంసాకు చెందిన హెచ్‌ఎం రాచేవాడ్ గంగాప్రసాద్. ఈయన భార్య పద్మావతి ఎస్‌ఏ(ఇంగ్లిష్)గా పనిచేస్తూ 2015లో మృతిచెందారు. దీంతో ఆమె జ్ఞాపకార్థం ప్రభుత్వ పాఠశాలల బాగు కోసం సొంతంగా ఖర్చు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. గంగాప్రసాద్ తొలుత తానూర్‌లో ఎస్జీటీగా, అక్కడి నుంచి ముథోల్‌లో ఎస్‌ఏగా, ఆపై మాటేగాం, చుచుంద్‌లో పనిచేశారు. ముథోల్‌లో పనిచేసిన సమయంలో అక్కడ 9 ప్రాథమికోన్నత పాఠశాలలను హైస్కూళ్లుగా, చుచుంద్, మిర్జాపూర్‌లోని ప్రాథమికోన్నత పాఠశాలలను సైతం అప్‌గ్రేడ్ చేయించారు. ప్రస్తుతం భైంసాలోని జెడ్పీ బాలికల పాఠశాల హెచ్‌ఎంగా చేస్తుండగా, తెలుగు మీడియం పాఠశాల భవనం పూర్తి శిథిలావస్థకు చేరడంతోపాటు విద్యార్థులకు వసతులు లేవు. సొంత ఖర్చుతో భవనానికి మరమ్మతు, ప్రార్థన కోసం స్టేజీ, కోతుల బెడద నివారణకు ఇనుప జాలి, విద్యార్థినులు, ఉపాధ్యాయుల కోసం మూత్రశాలలు, మరుగుదొడ్లు, 16 కంప్యూటర్లు, ఫ్యాన్లు, విద్యుత్ మరమ్మతులు చేయించారు. ఇందుకుగాను రూ.6.5లక్షలు వెచ్చించారు.

ప్రభుత్వ బడిని కాపాడాలి



పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య, వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నాం. నా భార్య ప్రభుత్వ ఉపాధ్యాయురాలే. ఆమె జ్ఞాపకార్థం ప్రభుత్వ బడుల బాగు కోసం నా వంతు కృషి చేస్తున్నాను. – ఆర్.గంగాప్రసాద్, హెచ్‌ఎం, జెడ్పీహెచ్ఎస్, భైంసా

నృత్యంలో మెలకువలు


నృత్యం నేర్పిస్తున్న టీచర్ అర్చన

మామడ: పొన్కల్ జెడ్పీ సెకండరీ పాఠశాల విద్యార్థులు ఆంగ్లంలో పట్టు సాధించేలా టీచర్ అర్చన (ఎస్‌ఏ) బోధిస్తున్నారు. తాను నేర్చుకున్న కళను వారికి అందించాలనే లక్ష్యంతో నృత్యంలో మెలకువలు నేర్పిస్తున్నారు. శాస్త్రీయ, జానపద నృత్యాలను నేర్చుకుంటున్న విద్యార్థులు జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని పాఠశాలకు గుర్తింపు తెస్తున్నారు. పాఠశాలలో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు సాయిరాం.. కృత్యాధార బోధనకు ప్రాధాన్యతను ఇస్తున్నాడు. ఆస్ట్రో ల్యాబ్‌ను వినియోగించుకుని పిల్లలతో ప్రయోగాల ద్వారా బోధన చేస్తున్నారు.

12 మంది.. ఆ సంఖ్య 76కు చేరింది

ఉట్నూర్‌రూరల్: తమ పాఠశాలలో గతేడాది 12 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని తల్లిదండ్రులకు వివరించాం. పిల్లలను బడిలో చేర్పించారు. హెచ్‌ఎం రాథోడ్ గజేందర్, ఉపాధ్యాయులు రమేశ్, సత్యపాల్ కృషితో ఆ సంఖ్య 76కు చేరింది. ఏకలవ్యలో 7, గురుకులంలో 3, మోడల్ పాఠశాలలో 10 మంది ప్రవేశం పొందారు. తమ కృషిని గుర్తించి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేయడం ఆనందం కలిగించింది. – ఆర్. గజేందర్, ఎంపీపీఎస్ వడోని ఉత్తమ ఉపాధ్యాయుడు

వ్యర్థాలతో బొమ్మలు తయారు చేసి..


బొమ్మలతో బోధిస్తున్న ప్రవీణ్‌కుమార్

లోకేశ్వరం: సేవాలాల్‌తండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ఎల్మల ప్రవీణ్‌కుమార్.. విద్యార్థులకు బొమ్మలతో విద్యాబోధన చేస్తున్నారు. కథనాలు, నాటికలు, పాఠ్యాంశాలు, క్లిష్టమైన గణిత భావనలను పప్పెట్ ద్వార బోధనతో వారిలో ఆసక్తి రేకిస్తున్నారు. వ్యర్థాలతో(ఉపయోగం లేని) బొమ్మలను విద్యార్థులతో తయారు చేయించి బోధన అందిస్తున్నారు. విద్యార్థులు స్వర మార్పులను గ్రహించి ఉపాధ్యాయున్ని అనుకరించి ఆటలు, కథల నాటికలో పాల్గొంటున్నారు. పప్పెట్ సెంటర్ ఫర్ కల్చరల్ రీసోర్స్ అండ్ ట్రెయినింగ్ (సీసీఆర్‌టీ) న్యూఢిల్లీలో శిక్షణ పొంది వచ్చి విద్యార్థులకు వాటి ద్వారా బోధిస్తున్నారు.

బోధనోపకరణాలతో..


క్షేత్ర పర్యటనలో విద్యార్థులతో రమేష్ బాబు

నిర్మల్‌రూరల్: సోన్ మండలం కడ్తాల్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న హెచ్‌ఎం రాజులదేవి రమేశ్‌బాబు తక్కువ ఖర్చుతో తయారుచేసిన బోధన ఉపకరణాలతో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నాడు. రాతియుగపు పనిముట్లు, సవరం, పడవ కరెన్సీ, అక్షర మాస్కులు, అక్షర కార్డులు, గుండె, మూత్రపిండాలు ఇలా రకరకాల బోధనోపకరణాలను తయారు చేసి బోధన చేస్తున్నాడు. పాఠ్యాంశంలోని విషయాలు క్షేత్ర పర్యటనల ద్వారా వారికి ప్రత్యక్షంగా అవగాహన కల్పిస్తున్నారు. విద్యార్థుల్లో జంక్ ఫుడ్ మాన్పించడానికి ప్రతి 2 నెలలకోసారి ఫుడ్ ఫెస్టివల్‌ను తల్లిదండ్రులతో కలిసి నిర్వహిస్తున్నారు. అప్పటి డీఈవో రామారావు ఆయన్ను అభినందించారు. విద్య రంగానికి ఆయన చేస్తున్న సేవలకు గాను 2016లో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, 2013లో రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు దక్కింది.

బోర్డుపై బొమ్మలు వేసి..


ఏఐ ద్వారా బోధిస్తున్న ఉపాధ్యాయురాలు శ్వేత

లక్ష్మణచాంద: మండలంలోని పీచర ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మహిళా ఉపాధ్యాయురాలు శ్వేత..బోధనోపకరణాలు వినియోగించి విద్య బోధించడం బోధనలో ప్రత్యేకత. విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ) ద్వారా విద్య బోధిస్తున్నారు. వారంలో బోధించిన విషయాలపై ప్రతీ శనివారం పిల్లలు ఇంటికి చేరిన తరువాత వారి పోషకుల మొబైల్ ఫోన్‌లో టెస్ట్ మోజ్ అనే యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో పిల్లలకు పరీక్ష నిర్వహిస్తున్నారు. విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించడానికి అరగంటపాటు చిన్నచిన్న కథలను బోర్డుపై బొమ్మలు వేసి బోధిస్తున్నారు.

క్రీడల్లో శిక్షణ



నిర్మల్‌రూరల్: ఖానాపూర్ మండలం సత్తెనపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు ఇమ్రాన్.. విద్యార్థులకు ఆటపోటీలు నిర్వహిస్తున్నారు. పాఠశాల సమయం తర్వాత గంటపాటు క్రీడల్లో శిక్షణ ఇస్తున్నారు. యోగా, వెయిట్ లిఫ్టింగ్ తదితర ఆటలను బ్యాచ్‌లవారీగా నేర్పుతున్నారు. ఇటీవల ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాఠశాల నుంచి 9 పతకాలు సాధించారు. ఢిల్లీలో జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో 67 కిలోల విభాగంలో శివ సాయి పాల్గొన్నారు. ఇదే విద్యార్థి బాసర ట్రిపుల్ ఐటీ లో స్పోర్ట్స్ కోటాలో సీటు సాధించాడు. ఇమ్రాన్ వివిధ రాష్ట్ర అంతర్జాతీయ క్రీడాకారులను పాఠశాలకు ఆహ్వానించి వారితో విద్యార్థులకు వివిధ ఆటల్లో తర్ఫీదునిస్తున్నాడు.

బొమ్మలను గీస్తూ.. బోధన చేస్తూ..


బొమ్మలు వేస్తున్న టీచర్ కవిత

తాంసి: విద్యార్థులకు పాఠాలు సులువుగా అర్థమయ్యేలా పాఠశాల గోడలపై రంగురంగుల బొమ్మలు గీస్తూ బోధిస్తూ తాంసి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు కవిత ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆమె గతేడాది క్రితం ఇక్కడు బదిలీపై వచ్చారు. విద్యార్థులను ఆకట్టుకునేలా పాఠాలు బోధిస్తూనే తన కళా నైపుణ్యంతో తరగతి గదులతోపాటు, ప్రహరీలపై వివిధ బొమ్మలు వేశారు. గ్రామస్తుల సహకారంతో రంగులు కొనుగోలు చేయగా విద్యార్థులకు జ్ఞానం, ఆహ్లాదం కలిగించేలా బొమ్మలను స్వయంగా వేశారు.

బడిమానేసిన పిల్లలను పాఠశాలల్లోకి..


అవార్డు అందుకుంటున్న మారుతి

ఇంద్రవెల్లి: భీంజీతాండ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంపునకు టీచర్ కరాడే మారుతి కృషి చేయడంతో జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నాడు. దస్నాపూర్ గ్రామానికి చెందిన ఈయన 2002లో ఉపాధ్యాయ వృత్తిచేపట్టాడు. గ్రామస్తులకు చదువులో ఉన్న ఆవశ్యకత, చదువుతోనే అభివృద్ధి సాధ్యమంటూ అవగాహన కల్పించి బడి మానేసిన పిల్లలను పాఠశాలలో చేర్పించారు. రెండేళ్లుగా భీంజీతండా పాఠశాలలో 25 మంది విద్యార్థులకు 65 మంది విద్యార్థుల సంఖ్యను పెంచారు.

వెనుకబడిన పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ


ప్రత్యేక తరగతి నిర్వహిస్తున్న సంతోష్(ఫైల్)

సిరికొండ: మండలకేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో చదువులో వెనుకబడిన పిల్లలపై ఉపాధ్యాయుడు జె.సంతోష్ హిందీ ఉపాధ్యాయుడు ప్రత్యేక శ్రద్ధ పెట్టాడు. వారికి అర్థమయ్యేలా పాఠాలు బోధించారు. పదో తరగతిలో అధిక మార్కులు సాధించేలా వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసి ఇంటికి వెళ్లిన తర్వాత పాఠాలపై సందేహాలను నివృత్తిచేసేవారు. అదే విధంగా పర్యావరణంపై అవగాహన, మొక్కలు నాటి పెంచడం కార్యక్రమాలు చేపట్టేవారు. సంతోష్ సేవలను గుర్తించి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేశారు.

ఇద్దరిని కాపాడి..వాగులో గల్లంతైన ఒకరు

- మల్లెంగిలో విషాదం


గల్లంతై మృతి చెందిన జాడే శంకర్


ప్రాణాలతో బయట పడిన జాదవ్ మిట్టు

నార్నూర్: ఇటీవల కురుస్తున్న వర్షాలు జనజీవనం అతలాకుతలం చేస్తున్నాయి. బుధవారం మధ్యాహ్నం భారీ వర్షం కురవడంతో మండలంలోని మల్లెంగి వాగు పొంగింది. అదే గ్రామానికి చెందిన మొత్తం 9 మంది రైతులు వ్యవసాయ పనుల కోసం వాగు అవతల ఒడ్డుకు ఉదయం చేరుకున్నారు. దినమంత పనిచేసి సాయంత్రం 5 గంటలకు తిరిగి ఇంటికి వెళ్లేందుకు బయల్దేరారు. గ్రామ సమీపంలోని వాగులో నీటి ప్రవాహం తక్కువ ఉండడంతో జాడే శంకర్ (42)తోపాటు, మరో ఇద్దరు రైతులు జాదవ్ మిట్టు, జాదవ్ మిథున్‌లతో కలిసి వాగు దాటే సాహసం చేశారు. అప్పటికే వాగులో భారీగా వరద నీరు ఒకే సారి రావడంతో ఉధృతి పెరిగింది. పరిస్థితిని గమనించిన శంకర్ ఇద్దరు రైతులను ఒడ్డుకు చేర్చి ప్రాణాలను కాపాడారు. ఆయన బయటి వచ్చే క్రమంలో వరద ఉధృతికి గల్లంతయ్యారు. రాత్రి 11 గంటల సమయంలో మృతదేహం కిలోమీటరు దూరంలో వాగులో లభించిందని ఎస్సై అఖిల్ తెలిపారు. మృతుడికి భార్య జాడే సరిత, ఇద్దరు కూమారులు ఉన్నారు.

మద్యం విక్రయిస్తున్న పలువురిపై కేసు

ఆదిలాబాద్‌రూరల్: గణేశ్ నిమజ్జనం సందర్భంగా వైన్స్, బెల్టుషాపులు మూసివేయాలని కలెక్టర్, ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. అయినప్పటికీ పలువురు అక్రమంగా మద్యం విక్రయాలు చేపడుతూ పట్టుబట్టారు. పక్కా సమాచారంతో గురువారం దాడి చేసిన మావల పోలీసులు పలు బీరు సీసాలను, మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కర్రె స్వామి తెలిపారు. దస్నాపూర్‌లో 37, మావలలో 35 లిక్కర్ బాటిళ్లు, బాలాజీనగర్‌లో 14 బీరు బాటిళ్లు, కేఆర్కే కాలనీలో 4 బీర్ బాటిళ్లు, 2 క్వార్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

భైంసాలో వృద్ధుడి మృతి

భైంసాటౌన్: పట్టణంలోని ఆటోనగర్ ప్రాంతంలో ఓ వృద్ధుడు మృతి చెంది కనిపించాడు. ఎస్సై సుప్రియ కథనం ప్రకారం.. ఆటోనగర్‌లోని నయారా పెట్రోల్‌పంప్ సమీపంలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. దీంతో సమాచారం అందుకున్న పోలీసులు గురువారం అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద లభించిన ఆధారాల ప్రకారం.. లోకేశ్వరం మండలం పుస్పూర్ తండాకు చెందిన మిట్టు నాయక్ (65)గా గుర్తించారు. ఈమేరకు మృతదేహాన్ని స్థానిక ఏరియాస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు. వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

హెచ్‌ఎంఎస్ కేంద్ర కమిటీలో పలువురికి చోటు

శ్రీరాంపూర్: హెచ్‌ఎంఎస్ కేంద్ర కమిటీలో పలువురికి చోటు కల్పిస్తున్నట్లు యూనియన్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్, సింగరేణి విభాగం అధ్యక్షుడు తిప్పారపు సారయ్య గురువారం తెలిపారు. కేంద్ర కార్యదర్శులుగా జి.సత్యనారాయణ, మీసా కొమురయ్య, ఏ.అనిల్, ఉపాధ్యక్షులుగా బోనాల శ్రీనివాస్, దుర్గం లక్ష్మణ్, పులి రాజిరెడ్డి, సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రెటరీలుగా కొల్లూరి శ్రీను, అశోక్ రెడ్డి, పంబల రాములును నియమించారు.

చంటిబిడ్డతో వాగు దాటి ఆస్పత్రికి..


చంటిబిడ్డతో వాగు దాటుతున్న ఈశ్వరిబాయి


కాలినడకన వెళ్తున్న ఈశ్వరిబాయి

ఇంద్రవెల్లి: మండలంలోని మామిడిగూడ గ్రామానికి చెందిన పెందోర్ ఈశ్వరి ఐదు నెలల బాలింత చంటిబిడ్డతో ఎత్తుకుని వాగు దాటి ఆస్పత్రికి తీసుకెళ్లింది. గ్రామానికి చెందిన పెందోర్ ఈశ్వరిబాయి చంటిబిడ్డకి రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. భారీ వర్షం కారణంగా వాగులో వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో ఆస్పత్రికి తీసుకెళ్లలేకపోయింది. గురువారం వాగులో వరదనీరు కొంత తగ్గడంతో తల్లి ఆర్క గంగుబాయితో కలిసి సంకలో చంటి పాపను ఎత్తుకుని ప్రాణాలను తెగించి వాగు దాటింది. అక్కడి నుంచి కాలినడన ఆంధ్‌మామిడిగూడ వరకు వచ్చి ఆటోలో మండలకేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లి వైద్యం అందించారు. వాగు వద్ద బ్రిడ్జి లేక ప్రతిఏటా వర్షాకాలంలో అత్యవసర సమయంలో ఇబ్బందులకు గురవుతున్నామని గ్రామస్తులు తెలిపారు. అధికారులు దృష్టిసారించి మంజూరైన నిధులతో మామిడిగూడ వాగు వద్ద బ్రిడ్జి నిర్మించాలని కోరుతున్నారు.

బ్రిడ్జి తెగింది.. ప్రయాణం ఆగింది



ఇటీవల కురిసిన వర్షాలకు పట్టణంలోని హరితం నగర్‌లో బ్రిడ్జి కొట్టుకుపోగా రోడ్డు కోతకు గురైంది. దీంతో ఆ కాలనీవాసులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వాహనదారులు బయటకు రాలేని పరిస్థితి ఉంది. అధికారులు స్పందించి తాత్కాలికంగా మరమ్మతు చేపట్టి రాకపోకలు జరిగేలా చూడాలని కాలనీవాసులు కోరుతున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్